క్లుప్తంగా

'పొంతన లేని నిబంధనలు పెడుతున్నారు'



బాన్సువాడ: షాదీ ముబారక్ పథకంపై పొంతన లేనివిధంగా నిబంధనలు పెడుతున్నారని పట్టణ మైనార్టీ సభ్యులు సబ్ కలెక్టర్ కిరణ్మయికి ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. గతంలో లేని విధంగా షాదీ ముబారక్ కోసం నిరుపేద మైనార్టీలు దరఖాస్తు చేసుకుంటే అబ్బాయి(పెళ్లి కుమారుడు) తరఫున సర్టిఫికెట్‌లను అందించాలని కోరుతున్నారని తెలిపారు. ఆ నిబంధన విరమించుకోవాలని కోరారు. అక్బర్, ఖాదీర్, ఇర్ఫాన్, లాయక్, రహీం పాల్గొన్నారు.

దివ్యాంగుల సహాయకులకు రైల్వే రిజర్వేషన్ కల్పించాలని వినతి



భిక్కనూరు: దివ్యాంగులతో పాటు వారి వెంట ఉండే సహాయకులకు నేరుగా రైల్వే రిజర్వేషన్ సౌకర్యం కల్పించాలని కోరుతూ భారత దివ్యాంగుల పరిరక్షణ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బైండ్ల భూపతి, జహీరాబాద్ ఎంపీ సురేశ్ షెట్కార్‌కు సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. దివ్యాంగులు రైలులో ప్రయాణించే సమయంలో దరఖాస్తు పత్రాలను పూర్తి చేయాలని నిబంధన ఉండటం వల్ల దివ్యాంగులకు వారి వెంట ఉండే సహాయకులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుందని అన్నారు. ఈ విషయమై కేంద్ర రైల్వే మంత్రికి తమ తరఫున విన్నవించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు.

వృద్ధుల సంఘం ప్రారంభం



భిక్కనూరు: లక్ష్మీదేవునిపల్లిలో వృద్ధుల సంఘాన్ని సోమవారం ఏర్పాటు చేసుకున్నారు. ఈ సందర్భంగా వృద్ధుల సంఘానికి అవసరమైన గదిని అద్దెకు తీసుకుని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామంలోని ప్రతి వృద్ధుడిని ఈ సంఘంలో సభ్యులుగా తీసుకుంటామని వారన్నారు. సంఘం నేతలు ఏనుగు రాంరెడ్డి, హన్మంత్ నర్సారెడ్డి, తిరుమల్‌రెడ్డి, నాగిరెడ్డి, మురళీరెడ్డి, ఏనుగు రాజిరెడ్డి, లింబారెడ్డి, గడ్డం ఇంద్రారెడ్డి, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



భిక్కనూరు: కాచాపూర్‌లో మల్లారెడ్డి నారాయణ హృదయాలయ ఆస్పత్రి ఆధ్వర్యంలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆస్పత్రి వైద్యులు 354 మందికి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైనవారికి ఉచితంగా మందులను అందజేశారు. మాజీ ఎంపీపీలు తొగరి సుదర్శన్, జాంగారి గాలిరెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాలీ ఆటో యూనియన్ కార్యవర్గం

భిక్కనూరు: మండలంలోని ట్రాలీ ఆటో యూనియన్ నూతన కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా బండి సత్యనారాయణ, కోశాధికారిగా బత్తుల నాగరాజు, ఆటోల ఇన్‌చార్జీలుగా బల్ల రాజు, పిట్ల నవీన్‌లు ఎన్నికయ్యారు. అధ్యక్షుడిగా ఎన్నికైన సత్యనారాయణ మాట్లాడుతూ.. ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన

సదాశివనగర్(ఎల్లారెడ్డి): నిజామాబాద్‌లోని హెచ్‌డీపీఈ పైప్‌ల పరిశ్రమలో ధర్మారావ్‌పేట్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులకు సోమవారం బీఐఎస్(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్)సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులపై అవగాహన కల్పించడానికి తర్ఫీదు పొందినట్లు హెచ్‌ఎం యోసెఫ్ తెలిపారు. వస్తు విక్రయాల్లో జరుగుతున్న మోసాలను ఎలా గుర్తించాలనే విషయంపై వివరించారు. కృష్ణాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శికి మెమో

సాక్షి ఎఫెక్ట్..

బాన్సువాడ రూరల్: ప్రకృతి వనం..వికృత రూపం శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. కాద్లాపూర్‌లో పల్లె ప్రకృతి వనంలో నీటి సౌకర్యం లేకపోవడంతో చెట్లు ఎండిపోతున్నాయి. మొక్కలు, చెట్లు ఎండిపోవడానికి కారణాలు తెలపాలంటూ పంచాయతీ కార్యదర్శి షహనాజ్‌కు ఎంపీడీవో బషీరుద్దీన్ మెమో జారీ చేశారు. కాగా ఉపాధిహామీ, పంచాయితీరాజ్ శాఖల అధికారులు గతంలో ఏర్పాటు చేసిన ప్రకృతి వనం వద్ద బోరుబావి నీటి సౌకర్యం లేదని, గ్రామంలో బోర్లు వేసినా నీరు పడటం లేదని పంచాయతీ కార్యదర్శి వివరణ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి



బాన్సువాడలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో పూజలు చేస్తున్న వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి, కాసుల బాలరాజ్



తిప్పారంతండా అంగన్‌వాడీ కేంద్రంలో సరస్వతి విగ్రహానికి పూజలు చేస్తున్న చిన్నారులు

వసంత పంచమి వేడుకలను సోమవారం జిల్లా వ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పలు ఆలయాలు, పాఠశాలల్లో సరస్వతి అమ్మవారికి విద్యార్థులు, భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాలు నిర్వహించారు.

– సాక్షి నెట్‌వర్క్



లింగారెడ్డిపేట ప్రాథమిక పాఠశాలలో..



బాన్సువాడ ఆలయంలో పాల్గొన్న భక్తులు



ఉత్తునూర్‌లో సరస్వతి విగ్రహం వద్ద పూజలు



కోనాపూర్ పాఠశాలలో..



శివాయిపల్లి ప్రభుత్వ పాఠశాలలో ..



పిట్లంలో..



నస్రుల్లాబాద్ అంగన్‌వాడీ సెంటర్‌లో..



రామారెడ్డిలో సర్వసతి విగ్రహానికి పూజలు



పిట్లం శిశు మందిర్ పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం



లింగంపేట సరస్వతి శిశు మందిర్‌లో ..



కామారెడ్డి అర్బన్: శారదామాత ఆలయంలో..



మహమ్మద్‌నగర్‌లోని మంజీర పాఠశాలలో..

అక్రమంగా పట్టా చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న పద్మ

కామారెడ్డి టౌన్: తనకు రావాల్సిన వాటా భూమిని అక్రమంగా తన అక్కకే మొత్తం భూమిని పట్టా చేయించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని దోమకొండ మండలం మాందాపూర్ గ్రామానికి చెందిన గొర్రె పద్మ కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్ భవనంలో ఆమె మాట్లాడారు. 8 నెలల క్రితం తమ తల్లిదండ్రులు చనిపోగా లింగాపూర్ గ్రామంలో తండ్రి పేరిట ఉన్న భూమిని అక్క లక్ష్మీకి 34 గుంటలు, నాకు(పద్మ) 24 గుంటలు పట్టా చేయించుకోవాలని కుల పెద్దల సమక్షంలో ఒ ప్పందం కుదుర్చుకున్నామని అన్నారు. కాని ఫ్యామిలీ మెంబర్‌షిప్ సర్టిఫికెట్ లేకుండా, తనకు తెలియకుండా మొత్తం భూమిని అక్క లక్ష్మి చేయించుకుందని ఇందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని కోరారు.

లీకేజీలకు మరమ్మతులు

సాక్షి ఎఫెక్ట్..



నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్ నగర్ మండలంలోని నర్వ గ్రామంలో రక్షిత మంచినీటి ట్యాంకు వద్ద ఉన్న పైపులైన్ లీకేజీకి సోమవారం గ్రామ పంచాయతీ అధికారులు మరమ్మత్తులు చేపట్టారు. 'పైపులైన్ల లీకేజీలను అరికట్టరూ.. అంటూ సోమవారం సాక్షి దినపత్రికలో వచ్చిన కథనానికి మిషన్ భగీరథ, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు స్పందించారు. సిబ్బందితో మరమ్మతులు చేయించారు. జీపీ కార్యదర్శి బలరాముడు, కారోబార్ జంగం ప్రభాకర్ తదితరులున్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

బాన్సువాడ రూరల్: వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తుగా నివారణ చర్యలు తీసుకుంటున్నట్లు బాన్సువాడ ఎంపీడీవో బషీరుద్దీన్ అన్నారు. సోమవారం ఆయన ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శ్రీకాంత్, జీపీ కార్యదర్శి ప్రశాంతితో కలిసి తాడ్కోల్‌లోని మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. ట్యాంకు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. తాగునీటి సమస్యలున్న కాలనీలను గుర్తించారు.

నాగిరెడ్డిపేటలో..

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని నాగిరెడ్డిపేట ఎంపీడీవో ప్రభాకరచారి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజ్‌కుమార్ సూచించారు. మాటూర్, చిన్నఆత్మకూర్, పెద్దఆత్మకూర్, మెల్లకుంటతండాలను సోమవారం వారు సందర్శించారు. ఆయా గ్రామాల్లోని మంచినీటి ట్యాంకుల పరిసరాలను వారు శుభ్రం చేయించారు. పంచాయతీ కార్యదర్శులు రవీందర్, పవిత్ర తదితరులున్నారు.

గురుకులాల్లో ప్రవేశాలపై అవగాహన

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): గోపాల్‌పేట, పోచారం, మాల్తుమ్మెద గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురుకులాల్లో ప్రవేశాలపై నాగిరెడ్డిపేట గిరిజన బాలుర గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ అమర్‌సింగ్ అవగాహన కల్పించారు. పాఠశాలల్లో విద్యార్థులకు కల్పించే వసతుల గురించి వారికి వివరించారు. ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసేందుకు ఈ నెల 6 వరకు గడువు ఉందన్నారు.

మద్య నిషేధం విధిస్తూ తీర్మానం

దోమకొండ: చింతమాన్‌పల్లిలో మద్య నిషేధం విధిస్తూ గ్రామస్తులు సోమవారం తీర్మానం చేశారు. గ్రామంలో మద్యం అమ్మితే రూ.లక్ష జరిమానా విధిస్తామని, ఎవరైన చూసి సమాచారం ఇస్తేవారికి రూ.5 వేల నగదును ఇస్తామని తెలిపారు. గ్రామ పెద్దల సమక్షంలో తీర్మానం చేసి సంతకాలు చేశారు. మాజీ సర్పంచులు సార్ల నర్సింలు, సింగిల్ విండో ఉపాధ్యక్షుడు సిద్ధరాములు, గ్రామ పెద్దలు ఉన్నారు.

ఆధ్యాత్మికం..

ఘనంగా వీరభద్ర స్వామి ఉత్సవాలు



ఎల్లారెడ్డి: పట్టణంలో వీరభద్ర స్వామి ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. స్వామివారి విగ్రహంతో శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు కార్యక్రమంలో ఆలయ పూజారి సంగమేశ్వరప్ప భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి కన్యకా పరమేశ్వరి ఆలయం..

బీబీపేట: మండల కేంద్రంలోని నూతనంగా నిర్మించిన కన్యకా పరమేశ్వరి ఆలయ ఉత్సవాలను ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో నేటి నుండి 4 రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నారు. ఇప్పటికే ఆలయంను విద్యుత్ దీపాలతో అలంకరించారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో మత్తడిపోచమ్మ ఆలయ నిర్మాణానికి వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు పూజలు చేశారు.

కరడ్‌పల్లిలో ఆలయ నిర్మాణానికి భూమి పూజ



తాడ్వాయి(ఎల్లారెడ్డి): కరడ్‌పల్లి శివారులో కార్యసిద్ధి రాజరాజేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ.. దాతల సహాయంతో ఆలయ నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఆసక్తి గలవారు విరాళాలు అందజేయవచ్చన్నారు.

'లాంగ్ మార్చ్'కు మాదిగలు సిద్ధం కావాలి



రామారెడ్డిలో డప్పులు వాయిస్తూ వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

రామారెడ్డి: హైదరాబాద్‌లో ఈ నెల 7న జరిగే లక్ష డప్పుల లాంగ్ మార్చ్‌కు మాదిగలు సిద్ధం కావాలని కామారెడ్డి ఎమ్మార్పీఎస్ జిల్లా పర్యవేక్షకుడు మంథని సామ్యేల్ మాదిగ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో లక్ష డప్పులు వేయి గొంతులు వాల్ పోస్టర్లను ఆవిష్కరించి డప్పుల ప్రదర్శన నిర్వహించారు. సామ్యేల్ మాదిగ మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయకుండా మాదిగ, ఇతర కులాలకు తీరని ద్రోహం, మోసం చేస్తున్న తెలంగాణ ప్రభుత్వంపై తాడోపేడో తేల్చుకోవడానికి సిద్ధం కావాలన్నారు.

నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తా వద్ద లక్ష డప్పులు-వేల గొంతుల పోస్టర్‌ను మాదిగ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు మెక్క సాయిలు ఆవిష్కరించారు. మండల కన్వీనర్ టేకుర్ల సాయిలు, ఎంఎస్ఎఫ్ నాయకులు మావురాం శ్రీకాంత్, నాయకులు మైశయ్య, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

బీబీపేట: హైదరాబాద్‌లో నిర్వహించే మాదిగల భారీ సాంస్కృతిక ప్రదర్శనను విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మార్పీఎస్ నాయకులు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఎమ్మార్పీఎస్ నాయకులు వెంకటరాములు, లక్ష్మి, బాలమణి, పోచయ్య, నర్సింలు, రాజు పాల్గొన్నారు.

భిక్కనూరు: లక్ష డప్పులు- వేల గొంతులు వాల్‌పోస్టర్లను భిక్కనూరు మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ నేతలు ఆవిష్కరించారు. ఈ సభకు ప్రతి మాదిగ కులస్తుడు డప్పులతో రావాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మణ్ మాదిగ పిలుపు నిచ్చారు. రాష్ట్ర కార్యదర్శి శంకర్ మాదిగ, మండలాధ్యక్షుడు కర్రోళ్ల రాజు, నేతలు ప్రదీప్, స్వామి, కృష్ణలు పాల్గొన్నారు

అంబేడ్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నేతలు

నిజాంసాగర్(జుక్కల్): మహమ్మద్‌నగర్ మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు స్థలం కేటాయించాలని కోరుతూ సోమవారం స్థానిక తహసీల్దార్ సవాయిసింగ్‌కు అంబేడ్కర్ యువజన సంఘం నాయకులు వినతి పత్రం అందజేశారు. కొత్తగా ఏర్పాటైన మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని, ప్రభుత్వ పరంగా స్థలం కేటాయించాలని వారు కోరారు. అంబేడ్కర్ యువజన సంఘం మండల అధ్యక్షుడు మంగ రాము, నాయకులు భూమేష్, శ్రీకాంత్, సుభాష్, సాయిలు తదితరులు ఉన్నారు.

ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలి



నిరసన తెలుపుతున్న దివ్యాంగులు

నస్రుల్లాబాద్(బాన్సువాడ): స్థానిక సంస్థల ఎన్నికల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించిన తర్వాతనే ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించాలని భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేశ్ డిమాండ్ చేశారు. సోమవారం మండల కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కళ్లకు గంతలు కట్టుకుని అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందించారు. దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించకపోతే రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఇంటి బాట పట్టిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు జాదవ్ పండరి, ఉపాధ్యక్షుడు లకావత్ మోహన్, మండల అధ్యక్షుడు ఓండ్ల భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ



కుంభాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్



శోభాయాత్ర నిర్వహిస్తున్న పద్మశాలి కులస్తులు

సదాశివనగర్(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో అపురూప అయ్యప్ప స్వామి విగ్రహ ప్రాణప్రతిష్ఠ కార్యక్రమానికి సోమవారం ప్రముఖులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ ఎమ్మెల్యే జాజాల సురేందర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వడ్డేపల్లి సుభాష్‌రెడ్డిలు హాజరయ్యారు. కుంభాభిషేకంలో పాల్గొన్నారు. మాజీ సర్పంచ్ బద్దం శ్రీనివాస్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ గాదారి శ్రీనివాస్ రెడ్డి, సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మండలాధ్యక్షులు సంగారెడ్డి, మహేందర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన

లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలో వసంత పంచమి సందర్భంగా పద్మశాలి కులస్తులు సోమవారం మార్కండేయ విగ్రహ ప్రతిష్ఠాపన నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం మార్కండేయ విగ్రహం, కలశాలతో గ్రామంలో శోభాయాత్ర చేపట్టారు. అనంతరం తోపుగుట్టపై విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. పద్మశాలి కులస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

ఘనంగా సాయిబాబా ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎల్లారెడ్డి: ఎల్లారెడ్డి పట్టణంలోని సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. 21 వార్షికోత్సవ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జనార్దన్ గౌడ్, ఆలయ ధర్మకర్త వీరేశలింగం పూజలు చేశారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించి అనంతరం సాయిబాబా పల్లకీ సేవ చేపట్టారు.

అయ్యప్ప ఆలయం..

ఎల్లారెడ్డి రూరల్: ఎల్లారెడ్డి పట్టణంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. 9వ వార్షికోత్సవంలో భాగంగా పూజలు చేశారు. అనంతరం పడిపూజ కార్యక్రమం నిర్వహించి అన్నదానం చేశారు. మున్సిపల్ మాజీ చైర్మన్, ఆలయ చైర్మన్ పద్మ శ్రీకాంత్, ఆలయ పూజారి శ్రీనివాసరావు భక్తులు పాల్గొన్నారు



ప్రసాదం స్వీకరిస్తున్న ఎమ్మెల్యే మదన్‌మోహన్

రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే

గాంధారి(ఎల్లారెడ్డి): బూర్గుల్‌లో గల రాజరాజేశ్వరి ఆలయ వార్షికోత్సవంలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ పాల్గొన్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అన్న ప్రసాదాలు స్వీకరించారు.

సంక్షిప్తం

స.హ.చట్టంపై ప్రభుత్వ చైతన్య కార్యక్రమాలు చేపట్టాలి

కామారెడ్డి అర్బన్: సమాచార హక్కు చట్టం అమల్లోకి వచ్చి 20 ఏళ్లవుతున్నా ప్రజలకు అవగాహన కల్పించడంతో ప్రభుత్వాలు విఫలం అవుతున్నాయని సమాచార హక్కు చట్టం పరిరక్షణ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ ఎంఏ సలీం అన్నారు. సోమవారం స.హ. చట్టంపై ఉచిత శిక్షణ శిబిరం నిర్వహించారు. ప్రతినిధులు ఎస్.ప్రదీప్‌కుమార్, లింబయ్య, ఎంపీ భాస్కర్, అన్వర్, ఈక శ్రీనివాస్, లింగం, జమున, సఫియా, రబియా బేగం తదితరులు పాల్గొన్నారు.

ఆలయం అభివృద్ధి కోసం విరాళం



లింగంపేట(ఎల్లారెడ్డి): రాంపల్లి స్కూల్ తండాలో నూతనంగా నిర్మాణం చేపట్టిన జగదాంబ, సేవాలాల్ మహరాజ్ ఆలయం అభివృద్ధి కోసం జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ సంపత్ గౌడ్ రూ.40 వేలు విరాళం అందజేశారు. ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గిరిజనులు గన్యా నాయక్, విఠల్, సక్ర్య, పరశురాం, సేవ్యా, తండావాసులు పాల్గొన్నారు.

మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి..



లింగంపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రం సమీపంలోని మత్తడి పోచమ్మ ఆలయ నిర్మాణానికి సోమవారం గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి తాండ్లె దశరథం రూ.లక్షా 11 వేల 111 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అశోక్, గౌరవ అధ్యక్షుడు శంకర్‌గౌడ్, కోశాధికారి మారుతి, తదితరులు పాల్గొన్నారు.

గ్రామసంఘాల ఆడిట్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో సోమవారం పలు గ్రామ సంఘాల ఆడిట్ ప్రక్రియను ప్రారంభించారు. ఈ సందర్భంగా గత ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు గ్రామసంఘాల ద్వారా జరిగిన ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులను తనిఖీ చేశారు. మిగతాసంఘాల ఆడిట్‌ను వచ్చే సోమవారం నిర్వహించనున్నారని ఏపీఎం జగదీశ్‌కుమార్ తెలిపారు. సీసీలు శ్రీనివాస్ రెడ్డి, రషీద్, రమేష్, సుజాత, అకౌంటెంట్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కొమురయ్యను గెలిపించాలి



కామారెడ్డి టౌన్: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్క కొమురయ్యను గెలిపించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మంత్‌రావు కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన మాట్లాడారు. తపస్ జిల్లా అధ్యక్షుడు రాఘవ రెడ్డి, రాష్ట్ర బాధ్యులు మేక రామచంద్రం, నాయకులు లక్ష్మీపతి, ఆంజనేయులు, సంతోష్, శ్యామ్‌గౌడ్, తదితరులున్నారు.

03పైలాలర్255: విరాళం అందజేస్తున్న దశరథం